సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 11 । జూలై । 2025



డ్రాగా ముగిసిన కడప-అనంతపురం మ్యాచ్

ఏసీఏ అండర్-19 మల్టీ డే మ్యాచ్‌లో మూడవ రోజు గురువారం కడప-అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. - 8లో



అరుణాచలం.. రైలులోనూ వెళ్దాం

పంచభూతాత్మక లింగాల్లో అగ్ని లింగం తేజో లింగంగా పేరొందిన అరుణాచలానికి వెళ్లే భక్తుల సంఖ్య ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి అధికంగా ఉంటోంది. - 8లో

గరిష్టం/కనిష్టం
30.7 /19.9

వాతావరణం

జిల్లాలో సోమవారం 19.9 - 30.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైభవం..సీతారాముల పౌర్ణమి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై సీతారాముల ఉత్సవ మూర్తులను కొలువుతీర్చారు. బంగారు ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. ముందుగా అర్చకులు విశ్వక్సేన పూజ, కలశ ప్రతిష్ట, యజ్ఞోపవీత ధారణ, మాంగల్యపూజ, కర్పూర హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం సతీ సమేతుడైన కోదండరామస్వామికి అర్చకులు పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి భక్తులు విచ్చేసి సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు. ఆలయ టీటీడీ సూపరిటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగార నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి



పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎమ్మెల్యే, సంస్థ ప్రతినిధులు

జమ్మలమడుగు రూరల్ : ఉక్కు కర్మాగారం నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించిందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు మండలపరిధిలోని సున్నపురాళ్ల పల్లె వద్ద జేఎస్‌డబ్ల్యూ గ్రూప్స్ ఆధ్వర్యంలో శిలాఫలకం వేసిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇంచార్జ్ భూపేష్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులతో కలసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా కర్మాగారానికి కావలసిన స్థలం, మౌళిక సదుపాయాల కల్పన మొదలైన అంశాలపై కంపెనీ ప్రతినిధులతో చర్చించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ జమ్మమడుగు ప్రాంతంలో కర్మాగారం నిర్మాణం చేపట్టడానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. జెఎస్‌డబ్ల్యూ స్టీల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యోగేష్ బేడీ, జీఎం వికాస్ కన్వర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ పూరి, ప్రాజెక్ట్ హెడ్ నూరుల్, ఆర్డీఓ సాయిశ్రీ పాల్గొన్నారు.

15 నుంచి క్రీడా పోటీలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం ఈ నెల 15 నుంచి 17 వరకు ఖేలో ఇండియా స్కీమ్ ద్వారా మహిళలకు పలు క్రీడలను నిర్వహించనున్నట్లు డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేక అధికారి కె, జగన్నాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలకు అథ్లెటిక్స్, అర్చరీ, వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. 22 ఏళ్లలోపు ఉన్న మహిళా క్రీడాకారిణులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన అవసరం

కడప ఎడ్యుకేషన్: నేటి ఆధునిక వ్యవసాయసాగులో పంటలకు ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన అవసరమని ఊటకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సమగ్ర పోషక యాజమాన్యం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయే పంటలకు ఎంత శాతం ఎరువులు అవసరమో ఈ శిక్షణ ద్వారా అందరు తెలుసుకోవాలని వివరించారు. ఏరువాక కేంద్రం అధిపతి బి. పద్మోదయ మాట్లాడారు. కే వి కే శాస్త్రవేత్తలు సాయిమహేశ్వరి, సురేష్ కుమార్ రెడ్డి, మానస, గిరీష్ కుమార్ పాల్గొన్నారు

జిల్లా పోలీసుశాఖలో బదిలీలు

కడప అర్బన్: జిల్లా పోలీసుశాఖలో గురువారం భారీ స్థాయిలో బదిలీలు జరిగాయి. వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో విధులను నిర్వహిస్తున్న 24 మంది ఏఎస్‌ఐలు, 32 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 109 మంది కానిస్టేబుళ్లను నలుగురు మహిళా కానిస్టేబుళ్లు మొత్తం 169 మందిని బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు.

బడి ముంగిట.. సమస్యల గంట!

ఊర్లో ఉండాల్సిన బడిని మూసేస్తే పిల్లల చదువులెలా? పిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానికి పట్టదా? కనీస సౌకర్యాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం లేదా? తల్లిదండ్రుల నుంచి బాణాల్లా దూసుకొచ్చిన ప్రశ్నలకు.. విద్యాశాఖ అధికారుల వద్ద జవాబు లేకుండా పోయింది. జిల్లా వ్యాప్తంగా గురువారం కూటమి ప్రభుత్వం నిర్వహించిన పేరెంట్ మీటింగ్స్‌లో బళ్లోని సమస్యల గంట గణ గణ మోగింది.

- మెగా పేరెంట్ మీటింగులో ప్రశ్నలు లేవనెత్తిన తల్లిదండ్రులు
- పాఠశాలల్లో వసతుల లేమిపై నిలదీత
- జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లో పేరెంట్ సమావేశాలు
- పలుచోట్ల ఎమ్మెల్యేలు డుమ్మా



అట్లూరు మండలం చెన్నుపల్లెలో బడి ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశాల్లో అధికారులు.. ప్రజాప్రతినిధులకు చుక్కెదురైంది. బడుల్లో సౌకర్యాల లేమిపై.. పాఠశాలల తరలింపుపై తల్లిదండ్రుల నుంచి ప్రశ్నల వర్షం కురిసింది. కాగా చాలా చోట్ల సమావేశాలకు తల్లిదండ్రులు గైర్హాజరయ్యారు.

- అట్లూరు మండలం చెన్నుపల్లెలో తల్లిదండ్రులు ప్లకార్డులతో తమ నిరసన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు ఊర్లోనే బడి పెట్టాలని.. కిలోమీటర్ల దూరంగా ఉన్న బడికి పంపేది లేదని స్పష్టం చేశారు
- కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో పిల్లల పర్యవేక్షణపై ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదని జేసీ అదితిసింగ్‌కు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. గతంలో పనిచేసిన హెచ్‌ఎంతోపాటు పీఈటీలను మళ్లీ ఇదే పాఠశాలకు వేయాలని డిమాండ్ చేశారు. 'తల్లికి వందనం' డబ్బులు పడలేదని కొంతమంది జేసీకి ఫిర్యాదు చేశారు.
- జిల్లాలోని మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమావేశాలకు గైర్హాజరయ్యారు. కొన్ని పాఠశాలల్లో సమస్యలున్నా అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేసేందుకు భయపడి ముందుకురానట్లు చర్చ సాగింది.

అద్దె బడి మాకొద్దు

పీటీఎం ఆత్మీయ సమావేశంలో తల్లిదండ్రుల ఆందోళన



సొంత భవనం నిర్మించాలని హెచ్‌ఎం దృష్టికి తీసుకొస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బద్వేలు అర్బన్ : శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ అద్దె బడి తమకొద్దని, తమ పిల్లలకు తక్షణమే సొంత పాఠశాల భవనం నిర్మించాలని చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో 1958లో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల క్రితం బద్వేలు - మైదుకూరు రహదారిలోని చెన్నంపల్లె వద్ద పాఠశాల భవనం నిర్మించారు. ఈ పాఠశాలలో 65 మంది విద్యార్థులు ఉండగా ఐదు మంది ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారు. బద్వేలు పట్టణంలో జరుగుతున్న ఎన్‌హెచ్-67 రోడ్డు విస్తరణ పనులు, బైపాస్ రోడ్డు పనులు చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాలకు శాపంగా మారాయి. నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా పాఠశాల గదులను కూల్చివేయాల్సి వచ్చింది. దీంతో గ్రామంలోని ఓ అద్దె భవనంలో పాఠశాల కొనసాగిస్తున్నారు. పాఠశాలను తొలగించినందుకు గాను నష్టపరిహారం కింద రూ.25 లక్షలు ఎంపీడీఓ అకౌంట్‌కు జమ చేశారు. శిథిలావస్థకు చేరి అద్దె ఇంట్లో కొనసాగుతున్న పాఠశాలకు తమ పిల్లలను భయంభయంగా పంపలేమని, కరెంటు పోయినా, వర్షం వచ్చినా గదుల కొరతతో తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే నూతన భవనం నిర్మించాలని తల్లిదండ్రులు పట్టుబట్టారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షామీర్‌బాష సమావేశంలో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని హామీ ఇచ్చారు.

పేరెంట్స్ మీటింగు నిర్వహించేదే లే!



పేరంట్ మీటింగు నిర్వహించేందుకు సహకరించాలని కోరుతున్న ఎంఈఓ

అట్లూరు : 'మా ఊరు పాఠశాల మా ఊరులోనే ఉంచే వరకూ మా పాఠశాలలో మెగాపేరెంట్ టీచర్ మీట్(పీటీఎం)ను నిర్వహించవద్దని'మండల పరిధిలోని చెన్నేపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల పేరెంట్స్ స్పష్టం చేశారు. మీటింగును పూర్తిగా అడ్డుకున్నారు. ఎస్.వెంకటాపురం పాఠశాలను మోడల్ పాఠశాలగా మార్చి చెన్నేపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో చదివే 3,4,5 తరగతుల విద్యార్థులను తరలించాలని ఉపాధ్యాయులు పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ పిల్లలు ఇక్కడే చదవాలి.. అక్కడకు పంపించం అంటూ చెన్నేపల్లి కాలనీ విద్యార్థుల తల్లిదండ్రులు తెగేసి చెప్పారు. అధికారుల ఆలోచన విరమించే వరకూ మీటింగు నిర్వహించవద్దు అంటూ ఫ్లెక్సీలు చేతపట్టుకుని పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి విలియంరాజు అక్కడకు చేరుకుని సమావేశం నిర్వహణకు తల్లిదండ్రులతో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళతానని ఆయన వెనుదిరిగారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు తల్లిదండ్రులే : జేసీ



జేసీకి సమ్యస్యలను తెలుపుతున్న తల్లిదండ్రులు

విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులే పునాదులని.. తమ పిల్లల చదువులపై ఉపాధ్యాయులను ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, కడప నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. మెగా పేరెంట్ మీటింగ్ సమావేశాల్లో భాగంగా కడప నగరపాలక మెయిన్ స్కూల్లో నిర్వహించిన సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల చదువులు, భద్రతపై పాఠశాల ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉండాలన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడంలో ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. మున్సిపల్ హైస్కూల్లో గతంలోనే అధునాతన వసతులను కల్పించామన్నారు. అనంతరం పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయి లో ఉన్న పలువురు పూర్వ విద్యార్థుల అనుభవాలను పిల్లలతో పంచుకున్నారు. ముందుగా పాఠశాలకు వచ్చిన జేసీ తరగతి గదులు, మెడల్ సెంట్రల్ కిచెన్‌ను పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు వారి తల్లుల పేరుతో మొక్కలు నాటారు. ఆర్డీవో జాన్ ఇర్విన్, కార్పొరేటర్ సూర్యనారాయణ, ఎంఈఓలు గంగిరెడ్డి, ఇర్షాద్, కార్పొరేషన్ స్కూల్స్ సూపర్‌వైజర్ ఫరూక్, హెచ్‌ఎం ముబీనా రెహ్మాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడపకు వచ్చారో..!

- ఈగల్ హంట్ ప్రతినిధులకు టీడీపీ ముఖ్యనేత బెదిరింపులు
- రిమ్స్‌లో మేము చెప్పినట్లే నడుచుకోవాలి
- మావాడితోనే సెక్యూరిటీ టెండర్ కొనసాగించాలి
- అధికారం అండతో బెదిరింపులకు పాల్పడుతున్న వైనం



సాక్షి ప్రతినిధి, కడప : 'రిమ్స్‌లో ఏం చేసినా మేమే చేయాలి.. మా మనుషుల ద్వారానే చేపట్టాలి. తిరుపతి నుంచి వచ్చి మీరు ఇక్కడ కొనసాగిస్తామంటే చూస్తూ ఊరుకోవాలా. ఇక్కడ మేం లేమా? టెండర్ వేసేటప్పుడు కనీసం సంప్రదించేది లేదా? ఇష్టానుసారం టెండర్లు వేస్తే మీకు స్వాగతం చెప్పాలా? గౌరవంగా చెబుతున్నాం, మీరు కడపకు రావొద్దు..' జిల్లా టీడీపీ ముఖ్యనేత చేసిన హెచ్చరికలు ఇవి. అధికారం అండతో ఈగల్ హంట్ ప్రతినిధిపై రెచ్చిపోయిన వైనమిది.

కడప రిమ్స్‌లో ఇప్పటివరకూ ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ ద్వారా సెక్యూరిటీ సర్వీసు అందుతోంది. కాల పరిమితి పూర్తి కావడంతో టెండర్లు ప్రక్రియ చేపట్టారు. ఈ మేరకు రిమ్స్‌లో సెక్యూరిటీ సర్వీసు అందించేందుకు న్యూఢిల్లీకి చెందిన ఈగల్ హంట్ ఏజెన్సీ కొత్తగా టెండర్లు దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఈగల్ హంట్ ఏజెన్సీ ప్రతినిధి తిరుపతికి చెందిన వ్యక్తికి టీడీపీ ముఖ్యనేత నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వెళ్లాయి. తమకు తెలియకుండా సెక్యూరిటీ సర్వీసు నిర్వహణకు వచ్చావో..నీకుంటుందంటూ హెచ్చరికలు జారీ చేశారు. బెదిరింపుల పర్వం నడుస్తుండగానే టెండర్లు పూర్తి అయ్యాయి. ఆ సెక్యూరిటీ సర్వీసులు తమ వర్గీయుడు ద్వారానే కొనసాగించాలంటూ ప్రజాప్రతినిధి కూడ ఫోన్ చేసి బెదిరింపులకు దిగినట్లు సమాచారం. 'మీరు టీటీడీ ఉద్యోగి, మాతో పెట్టుకొవద్దు అనవసర కాంప్లీగేషన్స్ లేకుండా సెక్యూరిటీ సర్వీసు అప్పగించా..' లంటూ ఫోన్లలో టీడీపీ ముఖ్యనేత, ప్రజాప్రతినిధి ముప్పుతిప్పలు పెడుతున్నట్లు సమాచారం. ఇప్పటికి కొలిక్కి రాకపోవడంతో వాడెలా నిర్వహిస్తాడో చూద్దామంటూ భీష్మించుకున్నట్లు సమాచారం.

శానిటేషన్ ప్రక్రియపై కూడా...

రిమ్స్‌లో ఇదివరకూ ఏ-1 ఏజెన్సీ శానిటేషన్ ప్రక్రియ కొనసాగిస్తోంది. ఈమారు టెండర్లలో ఎవరు పాల్గొనకుండా జిల్లా టీడీపీ ముఖ్యనేత మంతనాలతోపాటు, వర్గీయుల బెదిరింపులు తెరపైకి వచ్చాయి. ఇక ఎవరూ టెండర్లల్లో పాల్గొనరనే క్రమంలో తిరుపతికి చెందిన పద్మావతి ఫెస్ట్ కంట్రోల్ ఏజెన్సీ పాల్గొని టెండర్ దక్కించుకంది. టెండర్ బిడ్ ఓపెన్‌లో ఎల్-1గా నిలిచింది. ఫైనాన్స్ బిడ్ అనుమతి దక్కాల్సి ఉంది. ఈదశలో 'కడపకు వచ్చి మీరు ఎలా కొనసాగిస్తా'రంటూ జిల్లా టీడీపీ ముఖ్యనేత నుంచి ఫోన్లు వెళ్లినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పెట్టింది, అధికారికంగా పాల్గొన్నాం, టెండర్ దక్కుతోంది. కచ్చితంగా కొనసాగించి తీరుతామంటూ సదరు ప్రతినిధి నుంచి జవాబు రావడంతో సదరు టీడీపీ నేత అవాక్కయినట్లు తెలుస్తోంది. సత్తా లేని వాడైతే అలా మాట్లాడరు, ఆ కాంట్రాక్టర్ ఎవరు, వారికి తెరవెనుక ఎవరున్నారో తెలుసుకోవాలంటూ అనుచరులను పురమాయించినట్లు సమాచారం. ఇంత పెద్ద ఎత్తున బెదిరింపులకు పాల్పడడం వెనుక అటు సెక్యూరిటీ, ఇటు శానిటేషన్ టెండర్లు ద్వారా ప్రతి నెలా రూ.59లక్షలు బిల్లింగ్ ఉండడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. కాంట్రాక్టర్ నుంచి అప్పనంగా నెలనెలా కప్పం లభిస్తుండడంతో టీడీపీ ముఖ్యనేత రంకెలు వేస్తున్నట్లు సమాచారం. కాగా పద్మావతి ఫెస్ట్ కంట్రోల్ ఏజెన్సీ ఈ వ్యవహారాన్ని సీఎంఓ దృష్టికి తీసుకెళ్తున్నట్లు సమాచారం. ఫైనాన్స్ బిడ్ అప్రూవల్ రాగానే, సీఎంఓ ద్వారా రిమ్స్ అధికారులకు సిఫార్సులు చేయించుకొని కడపకు రానున్నట్లు తెలుస్తోంది.

పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

వల్లూరు : పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు ఉందని అదే లక్ష్యంతో పేరెంట్, టీచర్ల సమావేశాలను ప్రభుత్వం ప్రాధాన్యతతో నిర్వహిస్తోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. వల్లూరు మండల పరిధిలోని గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డీఈఓ షంషుద్దీన్, ఎంపీడీఓ రఘురాం, తహసీల్దార్ శ్రీవాణి, ప్రిన్సిపల్ సురేష్ బాబు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఏడాది పాలనలో అన్ని వర్గాలనూ మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలోని మోసాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల : చంద్రబాబు ఏడాది పాలనలో చేసిన మోసాలను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలోని స్టూడెంట్ వింగ్, మహిళా వింగ్, వలంటీర్ వింగ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వింగ్ వీటితోపాటు మన నాయకులు, కార్యకర్తలకు ఈ కాన్సెప్ట్ తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏంటి, ఈ ఏడాది పాలనలో ఆయన ఏమి అమలు చేశారు, ఏమి అమలు చేయలేదనేదే ప్రధాన అంశమన్నారు. చంద్రబాబు నాయుడు మ్యానిఫెస్టోను గుర్తు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలను తెలుగుదేశం పార్టీ ఏవిధంగా మభ్యపెట్టిందో మనకు స్పష్టంగా తెలుస్తోందన్నారు. జగనన్న ప్రొజెక్టర్‌లోని స్పీచ్‌ను చూసిన తర్వాత దాన్ని మన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అంతేకాక ప్రొజెక్టర్ ద్వారా మనం చూసిన అంశాన్ని కరపత్రంగా ముద్రించామని.. ఈ కరపత్రాన్ని ప్రతి ఇంటికి తీసుకపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రొజెక్టర్ ద్వారా మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రసంగం

ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగాన్ని ప్రొజెక్టర్ ద్వారా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వీక్షించారు. వైఎస్ జగన్ ప్రసంగంలో నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, దీపం పథకం, ఉచిత బస్సు, 50ఏళ్లకే పింఛన్ వంటి చంద్రబాబు హామీల ద్వారా ప్రజలు ఏ మేరకు నష్టపోయారో వైఎస్ జగన్ వివరించారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కరపత్రం ద్వారా రాష్ట్రంలోని నాయకులందరూ చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని ఆయన సూచించారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం తర్వాత ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ పేరుతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సంతకాలతో కూడిన బాండు పత్రాలను కూడా అందజేశారని పేర్కొన్నారు. ఈ ఏడాది కాలంలో చంద్రబాబు తన ఏడాది పాలనలో ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు బలరామిరెడ్డి, మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్, నూర్‌బాషా, దూదేకుల సంఘం నాయకులు రసూల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై సౌమ్యనాథస్వామి



చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు

నందలూరు : నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 7వ రోజు గురువారం రాత్రి కృష్ణుడి అలంకారంలో చంద్రప్రభ వాహనంపై స్వామివారు మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. అంతకుముందు ఉదయం సౌమ్యనాథస్వామి కూర్మాలంకారంలో సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో విహరించారు.భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం శ్రీ సౌమ్యనాథసేవా ట్రస్ట్ అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తెలిపారు.

నేడు ట్రాఫిక్ డైవర్షన్

శ్రీ సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం నందలూరు టౌన్‌లో ట్రాఫిక్ డైవర్షన్ చేయనున్నట్లు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి పేర్కొన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ పొత్తపి, చెన్నయ్యగారిపల్లి, లేబాక గ్రామాల వైపు నుంచి నందలూరు టౌన్‌కు వచ్చే ప్రజలు ఆలయం వైపు దారిలో రాకుండా ఈదరపల్లి, దుర్గాపురం మీదుగా వెళ్లాలని తెలిపారు. స్వామివారం కల్యాణానికి వచ్చే భక్తులు మాత్రం నందలూరు హరిజనవాడ దగ్గర ఉన్న పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలిపి గుడి వద్దకు కాలినడకన రావాలన్నారు.మండల ప్రజలు, నాయకులు, పోలీసు వారికి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

భర్త మూడో పెళ్లికి యత్నం.. మొదటి భార్య ఆత్మహత్య



రామలక్షుమ్మ (ఫైల్)

బద్వేలు అర్బన్ : ఆ వ్యక్తికి అప్పటికే రెండు పెళ్లిళ్లు అయ్యాయి. ఆరుగురు సంతానం కూడా ఉన్నారు. అయినా ఆయన మూడవ పెళ్లికి సిద్ధమయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన మొదటి భార్య కత్తితో పొడుచుకుని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి బద్వేలులో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుమిత్రా నగర్ (ఎరుకలవీధి)కు చెందిన జగన్నాధం రవి సుమారు 25 సంవత్సరాల క్రితం కడప నగరంలోని తిలక్‌నగర్ ఎస్టీ కాలనీకి చెందిన రామలక్షుమ్మ (42)ను వివాహం చేసుకున్నాడు. మరికొన్నేళ్లకు రామలక్షుమ్మ సమీప బంధువును కూడా వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఇటీవల రవి రాయచోటికి చెందిన తన సమీప బంధువుల అమ్మాయిని మూడవ వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయమై తరచూ రామలక్షుమ్మ, రవిల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఇటీవల రవి కొద్ది రోజులు ఇంటి పట్టున లేకుండా రాయచోటికి వెళ్లి వచ్చాడు. ఇంటికి వచ్చిన తర్వాత భార్య రవిని ప్రశ్నించింది. ఇదే విషయమై బుధవారం రాత్రి కూడా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో తాను తప్పనిసరిగా నా బంధువుల అమ్మాయిని వివాహం చేసుకుంటానని రవి తేల్చి చెప్పాడు. 'నీవు మరో వివాహం చేసుకుంటే నేను చనిపోతాను' అని రామలక్షుమ్మ తెలిపింది. 'నీవు ఏమైనా నాకు ఫర్వాలేదు. నేను పెళ్లి చేసుకునే తీరుతాన'ని రవి తెలిపాడు. దీంతో మనస్తాపానికి గురైన రామలక్షుమ్మ ఇంటిలోని మరో గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుని కత్తితో కడుపులో, ఎడమ చేతిపైన పొడుచుకుంది. చుట్టుపక్కల వారు గమనించి రామలక్షుమ్మను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. తమ అక్క మృతికి కారణమైన రవిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి..

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల పట్టణంలోని ఆవుల క్రిష్ణయ్య(64) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం రైల్వే ట్రాక్‌పై గూడ్స్ రైలు వస్తుండటంతో దాని కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలుపుతున్నారు. క్రిష్ణయ్య ముద్దనూరు రోడ్డులో టీఎంఆర్ మాల్ వెనుక వీధిలో నివాసం ఉంటున్నాడు. ఇతను హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగించే వాడు. అయితే గత కొద్దికాలం నుంచి అనారోగ్యంతో మానసిక స్థితి సక్రమంగా లేకపోవడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (45) అతిగా మద్యం సేవించి మృతి చెందాడు. గత రెండు రోజులుగా మద్యం సేవించి అక్కడే పడి వున్నాడు. గురువారం తెల్లవారుజామున చనిపోయాడు. అతని మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో వుంచారు. ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా సీఐ: 9121100510కు గానీ, ఎస్‌ఐ సెల్ నెంబర్: 9121100511లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలియజేశారు.

అరుణాచలం.. రైలులోనూ వెళ్దాం

- అతి తక్కువ చార్జీతో ప్రయాణం
- అన్ని వర్గాలకు అనుకూలం



అరుణాచలం వెళ్లే రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పంచభూతాత్మక లింగాల్లో అగ్ని లింగం తేజోలింగంగా పేరొందిన అరుణాచలానికి వెళ్లే భక్తుల సంఖ్య ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి అధికంగా ఉంటోంది. గిరి ప్రదక్షిణకు వేలాది మంది భక్తులు తరలి వెళుతున్నారు. కడప మీదుగా రైలు సదుపాయం ఉన్నా అవగాహన లేక భక్తులు బస్సులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే సౌకర్యంపై సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

కడప నుంచి అరుణాచలానికి రోడ్డు మార్గాన వెళ్లేందుకు దాదాపు 300 కి.మీ. దూరం ఉంటోంది. ఆర్టీసీ బస్సుల్లో సూపర్ లగ్జరీల్లో అయితే దూరాన్ని బట్టి రానుపోను రూ.1050 నుంచి 1300 వరకు చార్జీగా ఉంది. ఒకవేళ కారులో వెళితే దాదాపు రూ. 8–10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. వీటన్నింటితో పోలిస్తే రైలులో ప్రయాణిస్తే చార్జి తక్కువగా ఉన్నా.. రిజర్వేషన్ అందుబాటులో లేకపోవడంతో అనేక మంది ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

అందుబాటులో రైల్వేస్టేషన్లు

వైఎస్సార్ జిల్లా నుంచి పలు రైళ్లు అరుణాచలం సమీపానికి వెళుతున్నాయి. కడప నుంచి విల్లుపురం 360 కి.మీ. దూరంలో ఉంది. అయితే విల్లుపురం నుంచి అరుణాచలం 60 కి.మీ. దూరంలో ఉంది. ఎవరైనా అరుణాచలం వెళ్లాలంటే విల్లుపురం వరకు రైలులో వెళ్లి అక్కడి నుంచి రైలులో గానీ, బస్సులో గానీ, ఇతర వాహనాల్లో కూడా వెళ్లవచ్చు.

కడప మీదుగా వెళుతున్న రైళ్ల వివరాలు

అహ్మదాబాద్ నుంచి తిరుచానపల్లికి వెళ్లే వారాంతపు రైలు (09419) ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటలకు కడపకు చేరుకుని అదే రోజు సాయంత్రం 7.15 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. తిరిగి ఇదే రైలు (09420)మధ్యాహ్నం 12.10 గంటలకు విల్లుపురంలో బయలుదేరి కడపకు రాత్రి 8.25 గంటలకు చేరుతుంది. ఈ రైలు కడప స్టేషన్‌లో మాత్రమే ఆగుతుంది.

- లోకమాన్య తిలక్–మధురై (22101) రైలు ప్రతి గురువారం తెల్లవారుజామున 5.40 గంటలకు కడపకు చేరుకుని.. అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు విల్లుపురం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో (22102) రైలు విల్లుపురంలో శుక్రవారం రాత్రి 8.40 గంటలకు బయలుదేరి.. మరుసటిరోజు తెల్లవారుజామున 3.10 గంటలకు కడపకు చేరుతుంది. ఈ రైలులో రానుపోను రూ.550 చార్జిగా నిర్ణయించారు.
- ముంబయి–కరైకాల్ ఎక్స్‌ప్రెస్ (11017) వారాంతపు రైలు ప్రతి ఆదివారం తెల్లవారుజామున 5.40 గంటలకు కడపకు చేరుకుని మధ్యాహ్నం 1.55 గంటలకు విల్లుపురం చేరుతుంది. తిరిగి ఇదే రైలు (11018) విల్లుపురంలో సాయంత్రం 7.25 గంటలకు బయలుదేరి.. మరుసటిరోజు తెల్లవారుజామున 3.10 గంటలకు కడపకు చేరుతుంది.
- ముంబయి–నాగర్‌కోయిల్ (16351) ఎక్స్‌ప్రెస్ రైలు వారానికి రెండు సార్లు నడుస్తుంది. ఈ రైలు ప్రతి మంగళ, శనివారాల్లో మధ్యాహ్నం 1.20 గంటలకు కడపకు చేరుకుని, అదే రోజు రాత్రి 9.30 గంటలకు విల్లుపురం చేరుతుంది.
- కడప నుంచి అరుణాచలానికి ఓకా–మధురై (09520) ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులో ఉంది. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం సాయంత్రం 6.05 గంటలకు కడపకు చేరుకుని మరుసటి రోజు తెల్లవారుజామున 3.40 గంటలకు అరుణాచలానికి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు (09519) అరుణాచలంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి.. అదే రోజు మధ్యాహ్నం 1.55 గంటలకు కడపకు చేరుతుంది. ఈ రైలులో జనరల్ క్లాస్‌లో రూ.140, స్లీపర్‌లో రానుపోను రూ. 790, ఏసీ త్రీ టైర్‌లో రూ.2370లుగా చార్జీ నిర్ణయించారు.
- కాచిగూడ–పాండిచ్చేరి వెళ్లే రైలు (17653) ప్రతి సోమ, గురు, శనివారాల్లో కాచిగూడలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 1.30 గంటలకు కడపకు చేరుకుని ఉదయం 9.00 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం 3 గంటలకు విల్లుపురంలో బయలుదేరి రాత్రి 10 గంటలకు కడపకు చేరుకుంటుంది.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



వైఎస్సార్ జిల్లా నుంచి అరుణాచలానికి వెళ్లే భక్తుల సంఖ్య బాగా పెరుగుతోంది. నేరుగా వెళ్లేందుకు ఓకా–మధురై ఎక్స్‌ప్రెస్, కడప నుంచి అరుణాచలంకు సమీపంలోగల విల్లుపురం వెళ్లే రైళ్లు అందుబాటులో ఉన్నాయి. కడప నుంచి కాట్పాడికి వెళ్లి అక్కడి నుంచి నేరుగా అరుణాచలానికి వెళ్లవచ్చు. రైల్వేశాఖ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– జనార్దన్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, కడప

ఫుడ్ కార్పొరేషన్ అధికారుల పర్యటన



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : న్యూఢిల్లీకి చెందిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు గురువారం జమ్మలమడుగు నియోజకవర్గంలో పర్యటించారు. గొరిగెనూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం, రైతు సేవ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే జమ్మలమడుగు వ్యవసాయ మార్కెట్‌యార్డును సందర్శించి రైతులకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. ఎర్రగుంట్ల మండలం చిలంకూరులోని ఓ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఒకే దేశం ఒకే కార్డు పథకం కింద దేశంలోని ఏ రేషన్ షాపు నుంచి అయినా కార్డుదారులు బియ్యం పొందవచ్చని తెలియజేశారు. అనంతరం కడపలోని బఫర్ గోడౌన్‌కు చేరుకుని బియ్యం నాణ్యత, పోర్టిఫైడ్ బియ్యం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీకే దిన్నె మండలం బోడెద్దులపల్లి చౌక దుకాణం పరిధిలోని కార్డుదారులతో మాట్లాడారు. వారు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శిరీష, జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్, ఫుడ్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

వేంపల్లె ఘటనలో 150 మందికి పైగా కేసులు

- పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారని కానిస్టేబుల్ ఫిర్యాదు
- ఎస్పీ ఆదేశాల మేరకు నమోదు



వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో పగిలిన కిటికీ అద్దాలు (ఫైల్)

వేంపల్లె : వేంపల్లె ఘటనలో 150 మందికి పైగా కేసులు నమోదు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. కానిస్టేబుల్ బి.రామాంజనేయులు ఫిర్యాదు మేరకు.. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం డీఎస్పీ మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. 'వేంపల్లెలోని పక్కీర్‌పల్లెకు చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసిన ఘటనలో 150 మందికి పైగా కేసులు నమోదు అయ్యాయి. ఈ నెల 7వ తేదీన సాయంత్రం 7 గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌లో సెంట్రీగా రామాంజనేయులురెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో వేంపల్లె పంచాయతీ పరిధిలోని పక్కీర్‌పల్లెకు చెందిన సయ్యద్ సుమియా, చింతలమడుగుపల్లెకు చెందిన మడకబాబులు ప్రేమించుకున్నారని, వారిని మధ్యాహ్న సమయంలో ముచ్చుకోన దగ్గర ఉన్న వజ్రాల గుట్టలో ఉండగా.. సుమియా తల్లిదండ్రులు చూసి మడక బాబుపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని పోలీసు స్టేషన్ వద్దకు వచ్చారు. ఈ నేపథ్యంలో మడక బాబుతోపాటు వల్లెపు గంగాధర్, విజయ్ కుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తుండగా ముస్లిం వర్గానికి చెందిన పక్కీర్ పల్లెకు చెందిన సయ్యద్ మహమ్మద్ మూసా, రాజీవ్ నగర్ కాలనీకి చెందిన మస్తాన్, వేంపల్లెకు చెందిన మాజీ జెడ్పీటీసీ షబ్బీర్, బిద్దాలమిట్టకు చెందిన అబ్దుల్, ఇబ్రహీం, హైదర్ వలి (లాడెన్), మదీనాపురానికి చెందిన గుజిరి దర్బార్, అక్బర్, ఇబ్రహీం, సమీర్, ఈసుబ్, కోహినూర్ నజీర్‌లతోపాటు దాదాపు 150 మందికి పైగా మూకుమ్మడిగా పోలీస్ స్టేషన్ అవరణలోకి వచ్చి మడక బాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని గొడవకు దిగారు. నిందితులను విచారణ చేస్తున్నామని పోలీసులు ఎంత చెప్పినా వినకుండా పోలీసులు డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. పోలీసులనే హత మార్చాలనే ఉద్దేశంతో రాళ్లు విసరగా హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, కానిస్టేబుల్ కిరణ్ కుమార్, మహమ్మద్ ఆలీ, నజీర్ అహమ్మద్ తప్పించుకున్నారు. పోలీస్‌స్టేషన్ ముట్టడిదారులు అంతటితో ఆగకుండా రాళ్లు తీసుకుని పోలీస్ స్టేషన్ కిటికీ అద్దాలు, వరండాలోని ఇనుప కుర్చీ, వెనుక వైపు ఉన్న డోరును ధ్వంసం చేసి ప్రభుత్వ ఆస్తి నష్ట పరిచారు. అంతే కాకుండా పోలీసు యూనిఫాంలో ఉన్న వారికి విధులకు ఆటంకం పరిచినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు' డీఎస్పీ వివరించారు.

పోలీసుల అదుపులో 40 మంది?

వేంపల్లె : వేంపల్లె పోలీస్‌స్టేషన్ ముట్టడి కేసులో 200 నుంచి 300 మందిని అరెస్టు చేసే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే పోలీస్ స్టేషన్‌ను ముట్టడి చేసిన కేసులో 40 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకోవాలనే ఉద్దేశంతో నాలుగు బృందాలుగా పోలీసులు ఏర్పడి వేంపల్లెలో జల్లెడ పట్టడం జరుగుతోంది. గురువారం వేంపల్లెలో ఉన్న 40 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఇతర ప్రాంతాల పోలీస్‌స్టేషన్లకు తరలించినట్లు సమాచారం. వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చర్యలు తీసుకోవడంతో.. పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన చాలా మంది వేంపల్లెను విడిచి పెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం జరిగింది. పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన వారితోపాటు సంఘటనను చూసేందుకు వచ్చిన వారు కూడా తమను ఎక్కడ అరెస్టు చేస్తారోనని భయంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. డీఎస్పీ వేంపల్లెలో మకాం వేసి ముట్టడిదారుల అరెస్టుపై ఆరా తీస్తున్నారు. బాలిక తండ్రి మాబువలి ఫిర్యాదు మేరకు మడక బాబుపై అత్యాచార కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

బ్రిటీష్ పాలన కంటే ఘోరం

- వైఎస్ జగన్ పర్యటనలకు ప్రజలు బ్రహ్మరథం
- 25 చెక్‌పోస్టులు పెట్టి రైతులను అడ్డుకున్నా.. తరలివచ్చారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో బ్రిటీష పాలన కంటే దారుణమైన పాలన కొనసాగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా మేనిఫెస్టోలో చెప్పిన ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రూ.1.75 లక్షల కోట్లు అప్పులు చేసినా ప్రజా సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలని, ప్రస్తుతం రాష్ట్రం కరువుతో అల్లాడుతోందన్నారు. పంటలు అంతంత మాత్రంగానే పండుతున్నాయని, ఆ పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధర లేదన్నారు. పంటలు కొని రైతులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం ఒక్క కేజీ కూడా కొనలేదన్నారు. కేంద్రంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, మొదటి ఏడాది ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. రైతులు తెచ్చిన అప్పులకు సున్నావడ్డీ అసలే ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి దశలోనూ రైతులకు సాయమందించారని, రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రూ.7450 కోట్లు వారి కోసమే వినియోగించారన్నారు. కూటమి ప్రభుత్వం రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పి, దాని ఊసే ఎత్తడం లేదన్నారు. మొన్న ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులను పరామర్శించడానికి వైఎస్ జగన్ వెళితే రైతులు లక్షలాది మంది తరలి వచ్చారని, నిన్న చిత్తూరులో 25 చెక్‌పోస్టులు పెట్టి అడ్డుకున్నా మామిడి రైతులు వేలాది మంది హాజరయ్యారన్నారు. చిత్తూరు జిల్లాలో 90 వేల మంది రైతులు రెండున్నర లక్షల ఎకరాల్లో మామిడి సాగు చేశారని, 7 లక్షల టన్నుల మామిడి పంట వచ్చిందన్నారు. మామిడిని రూ.2లకు కొనేవారు లేరని, అందుకే మామిడి రైతులు తమ బాధలు చెప్పుకొనేందుకు వైఎస్ జగన్ వద్దకు వచ్చారన్నారు. హెలీప్యాడ్ వద్ద 30 మంది కంటే ఎక్కువ ఉండకూడదు, మార్కెట్ యార్డులో 500 మంది కంటే ఎక్కువ ఉండకూడదని వేలాది మంది పోలీసులను మోహరించి అన్ని విధాలుగా నియంత్రించారన్నారు. మాజీ మంత్రులకు సైతం నోటీసులిచ్చి రౌడీ షీట్లు తెరుస్తామని బెదిరించారన్నారు. ఇది ప్రజాస్వామ్యమో, నియంతృత్వమో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు బాధల్లో ఉన్నారని వారిని పరామర్శించేందుకు ఎవరు వచ్చినా స్పందన ఇలాగే ఉంటుందన్నారు. చంద్రబాబు రైతులను పరామర్శించరని, ఎవరైనా పరామర్శిస్తే ఓర్వలేరని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకొని ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధి కనబరచాలని, లేని పక్షంలో తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్, రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి, జిలా ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్టారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు షఫీవుల్లా, వి.నాగేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దేశం కోసం మధ్యవర్తిత్వం' ప్రచారం ప్రారంభం



మధ్యవర్తిత్వంపై ప్రచార ప్రారంభ కార్యక్రమంలో జడ్జి కె.ప్రత్యూష కుమారి, ప్యానల్ న్యాయవాదులు

కడప అర్బన్ : రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశానుసారంగా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు సూచనల మేరకు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ ఇన్‌చార్జి సెక్రటరీ కె. ప్రత్యూషకుమారి ఆధ్వర్యంలో.. 'దేశం కోసం మధ్యవర్తిత్వంపై గురువారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు ఒక వారం అవగాహన ప్రచారం' సందర్భంగా కడప కోర్టు ప్రాంగణంలో స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌లో మధ్యవర్తిత్వం సంబంధించి కరపత్రాలు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కలిగించారు. ప్రజలకు మధ్యవర్తిత్వానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కడప నగరంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్, కలెక్టరేట్, రైల్వే స్టేషన్, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్, డీఎస్పీ ఆఫీస్, సంధ్యా సర్కిల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, పాత బస్టాండ్ సర్కిల్, సెవెన్‌రోడ్ సర్కిల్, దిశా పోలీస్ స్టేషన్ మొదలగు ప్రాంతాలలో ఫ్లెక్సీలు, బ్యానర్లను ప్రదర్శించారు. మధ్యవర్తిత్వానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు సుబ్రహ్మణ్యం, హసీనా, పారా లీగల్ వాలంటరీలు దశరథ రామిరెడ్డి, ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్సలు



చికిత్స పొందుతున్న మహిళతో సూపరింటెండెంట్, వైద్యులు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో గైనకాలజీ విభాగంలో అరుదైన శస్త్రచికిత్సలు నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

- 13 ఏళ్ల బాలిక ముట్టు సమస్యతో గైనకాలజీ విభాగంలో చేరారు. పరీక్షించగా తనకు అరుదైన జన్యు వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ చేసి ఎడమ వైపు హెర్నియాలో ఉన్న అండాశయాన్ని, ఎడమ వైపు ఉన్న గర్భసంచి సగభాగాన్ని తొలగించారు. ప్రపంచంలో ఇటువంటి కేసులు ఇప్పటి వరకు ఐదు మాత్రమే నమోదు అయ్యాయని సూపరింటెండెంట్ తెలిపారు.
- 46 ఏళ్ల మహిళ కడుపు ఉబ్బరంతో బాధ పడుతూ అడ్మిట్ అయ్యారు. పరీక్షలు చేశాక అండాశయంలో పెద్ద కణితిని గుర్తించారు. శస్త్ర చికిత్స చేసి 8 కేజీల కణితిని తొలగించారు.
- 55 ఏళ్ల మహిళ కడుపు నొప్పితో బాధపడుతూ అడ్మిట్ అయ్యారు. పరీక్షలు జరిపాక అండాశయ క్యాన్సర్ తో బాధపడుతున్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్స చేసి 6 కేజీల క్యాన్సర్ గడ్డతోపాటు స్టేజింగ్ లాపారోటమీ అనే చికిత్స చేసి క్యాన్సర్ భాగాలను తొలగించారు.
- శస్త్ర చికిత్స చేశాక ముగ్గురు పేషెంట్స్ బాగా కోలుకున్నారని, అందరినీ డిశ్చార్జ్ త్వరలో చేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. అన్నీ శస్త్ర చికిత్సలు గైనకాలజీ హెచ్‌ఓడి డాక్టర్ లక్ష్మీసుశీల ఆధ్వర్యంలో డాక్టర్ అమానుల్లా, క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణుల నేతృత్వంలో చేసినట్లు పేర్కొన్నారు. గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ, డాక్టర్ పద్మావతి, డాక్టర్ రబ్బాని బేగం, డాక్టర్ రేఖారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, పీజీ వైద్యులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నట్లు తెలిపారు. అనస్థీసియా విభాగాధిపతి డాక్టర్ సునీల్ చిరువెళ్ల, అసోసియేట్ ప్రొఫెసర్స్ డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ మంజు శృతి, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

తప్పిన పెను ప్రమాదం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వేరుశనగ గడ్డి ట్రాక్టర్

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి ఆలయానికి సమీపంలో గల కొండపైనున్న రోడ్డులో గురువారం పెద్ద ప్రమాదం తప్పింది. వేంపల్లె వైపు నుంచి చక్రాయపేట వైపు పశువుల మేత కోసం వేరుశనగ గడ్డి వేసుకొని వస్తున్న ట్రాక్టర్.. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం విరిగి పోయింది. విద్యుత్ వైర్ల సాయంతో అది కింద పడకుండా అలాగే ఉండి పోయింది. ఈ సమయంలో విద్యుత్ ఉన్నప్పటికీ.. అదృష్టవశాత్తు, దేవుడి దయ వల్ల మంటలు చెలరేగలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గండిలో విధులు నిర్వహిస్తున్న ఆర్కేవ్యాలీ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ విషయం తెలుసుకొని.. హుటాహుటిన అక్కడికి చేరుకొని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి సరఫరాను నిలిపి వేయించారు. అనంతరం ట్రాక్టర్‌ను పక్కకు తొలగించారు. చెత్త ట్రాక్టర్ అడ్డుగా నిలబడి పోవడంతో రాయచోటి వేంపల్లె మార్గంలో కొద్ది సేపు రాకపోకలకు అంతరాయం కలిగింది.

మైదుకూరులో విషాదం

కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం

మైదుకూరు : కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంతో మైదుకూరులో విషాదం నెలకొంది. స్థానిక నంద్యాల రోడ్డులోని మహబూబ్ నగర్ ప్రాంతానికి చెందిన కమాల్ బాషా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు విహార యాత్రకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యారు. సంఘటనలో కమాల్ బాషాతోపాటు ఆయన మరదలు మున్ని, మనుమరాలు నదియా మృతి చెందడం.. వాహనంలో ఉన్న మిగిలిన వారు గాయపడటంతో కమాల్ బాషా బంధువులు కన్నీరు అవుతున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌కు వెళ్లడానికి ముందు కమాల్ బాషా కుటుంబం నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగకు వెళ్లినట్టు తెలుస్తోంది. శనివారం నెల్లూరుకు వెళ్లిన వారు మంగళవారం ఇంటికి చేరుకొని అదే రోజు మధ్యాహ్నం నుంచి హైదరాబాద్‌కు వెళ్లినట్టు కమాల్ బాషా ఇరుగుపొరుగు వారు చెప్పారు. విహార యాత్రలో సంతోషంగా గడిపి తిరిగి వస్తున్న సమయంలో అతని కుటుంబం ప్రమాదానికి గురికావడం పట్ల వారు ఎంతో ఆవేదన చెందుతున్నారు.

ఆపరేషన్ 'క్యాంపస్ సేఫ్ జోన్'

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థల వద్ద 100 మీటర్ల దూరంలో సిగరెట్, పొగాకు సంబంధిత ఉత్పత్తులు విక్రయించడం నిషేధించడమైనదని, ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మూడవ రోజున గురువారం పోలీసు అధికారులు తమ పరిధిలోని ఆయా పాఠశాలలు, కళాశాల, విద్యా సంస్థలను సందర్శించి 100 మీటర్ల లోపు టీ షాపులు, పాన్ షాపులు, కిరాణం షాపులలో సిగరెట్లు, ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు అమ్మడం నిషేధమని షాప్ నిర్వాహకులకు తెలిపారు. విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులను విక్రయించే షాపుల యజమానులకు (సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం)కోప్టా యాక్టు ప్రకారం జరిమానాలు విధించారు. సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడానికి ఉద్దేశించిన కార్యక్రమమని పోలీసు అధికారులు తెలిపారు. యువత భవిష్యత్‌ని కాపాడేందుకు ఈ తరహా నిషేధిత పదార్థాల వినియోగాన్ని నిరోధించాల్సిన అవసరం ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

మహిళల భద్రతకు శక్తి యాప్, వాట్సాప్ సేవలపై అవగాహన

కడప అర్బన్ : మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్, శక్తి వాట్సాప్ నంబర్ 7993485111 గురించి పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్‌లు, అంగన్వాడీ కేంద్రాలు ఇతర ప్రదేశాలలో, శక్తి యాప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవడం వల్ల విద్యార్థులకు రక్షణ, భద్రత ఉంటుందని ప్రతి ఒక్కరూ శక్తి యాప్‌ను ఫోన్లో నిక్షిప్తం చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తి టీం బృందాలు తెలియజేశాయి. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా డయల్ 112 బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

డ్రాగా ముగిసిన కడప-అనంతపురం మ్యాచ్



కడప రోహిత్ వర్మ (133 పరుగులు)



చిత్తూరు లోహిత్ లక్ష్మీ నారాయణ (138 పరుగులు)



చిత్తూరు ఘని (5 వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ డే మ్యాచ్‌లో మూడవ రోజు గురువారం కడప–అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. వైఎస్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో 74 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన కడప జట్టు 107 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 455 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 204 బంతుల్లో 133 పరుగులు, ఆర్థిత్ రెడ్డి 156 బంతుల్లో 111 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని వరుణ్ సాయి నాయుడు 4 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో అధిక్యం సాధించింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై చిత్తూరు జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడవ రోజు గురువారం 143 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 71.2 ఓవర్లలో 272 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని హృదయ్ 85 పరుగులు, విఖ్యాత్ 85 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని ఘని చక్కటి లైనప్‌తో బ్యాటింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 42.2 ఓవర్లలలో 3 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీ నారాయణ 113 బంతుల్లో 138 పరుగులు చేశాడు.